గిరిజన మహిళను కొట్టి.. అర్ధనగ్నంగా ఊరేగించి

- ప్రధాని స్వరాష్ట్రంలో దారుణం
- 12 మంది నిందితుల అరెస్ట్
- ఘటనపై విపక్షాల ధ్వజం

దాహూద్: ప్రధాని మోదీ స్వరాష్ట్రం, బీజేపీ పాలిత గుజరాత్‌లో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. ఒక గిరిజన మహిళను సాక్షాత్తూ ఆమె మామ, మరిది మరికొందరు కలిసి దౌర్జన్యం చేసి కొట్టి, అర్ధనగ్నంగా చేసి, చేతులు కట్టేసి వీధులలో ఊరేగించిన సంఘటన దాహూద్ జిల్లా సంజేలి తాలుకా గ్రామంలో ఈ నెల 28న జరిగింది. వివాహేతర సంబంధం పెట్టుకుందన్న ఆరోపణతో వారు ఈ దౌర్జన్యానికి పాల్పడ్డారని, ఈ సందర్భంగా 15 మందిపై కేసు నమోదు చేసి 12 మందిని అరెస్ట్ చేసినట్టు ఎస్పీ రాజ్‌దీప్‌సిన్హ్ జలా శుక్రవారం తెలిపారు. అరెస్టయిన వారిలో నలుగురు మహిళలు, నలుగురు పురుషులు ఉన్నారన్నారు. పోలీసుల కథనం ప్రకారం.. బాధితురాలు అదే గ్రామానికి చెందిన ఒక వ్యక్తితో వివాహేతర సంబంధం పెట్టుకుంది. ఈ నెల 28న ఆమె మామ, మరిది మరికొంతమంది గ్రామస్థులు కలిసి మూకుమ్మడిగా ఆ వ్యక్తి ఇంటిపై దాడి చేశారు. అక్కడ ఉన్న ఆమెను కొట్టి గ్రామంలో ఊరేగించారు. ఈ సందర్భంగా ఆమెను మోటారు సైకిల్‌కు కట్టేసి రోడ్డుపై ఈడ్చుకుంటూ వెళ్లి ఒక ఇంటిలోని గదిలో బంధించారు. కాగా, గుజరాత్‌లో క్షీణిస్తున్న శాంతి భద్రతలపై విపక్ష కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ తీవ్రంగా విమర్శించాయి. నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశాయి.

టాయిలెట్ సీటును నాకించి.. ఫ్లష్‌లో తలను ముంచి..

కేరళలో విద్యార్థుల ర్యాగింగ్ తాళలేక విద్యార్థి ఆత్మహత్య

తిరువనంతపురం: తోటి విద్యార్థుల ర్యాగింగ్, బెదిరింపులు తాళలేక తీవ్ర అవమానంతో ఒక బాలుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కేరళలో ఆలస్యంగా వెలుగు చూసింది. గ్లోబల్ పబ్లిక్‌స్కూల్‌లో చదివే 15 ఏండ్ల మిహిర్ ఎర్నాకులం త్రిప్పునితరలోని తన అపార్టుమెంట్ 26వ అంతస్తు నుంచి దూకి ఈ నెల 15న ఆత్మహత్య చేసుకున్నాడు. తొలుత అతను ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడో కుటుంబ సభ్యులకు తెలియలేదు. తర్వాత స్నేహితులతో మాట్లాడి, అతడి సామాజిక మాధ్యమ ఖాతాలు పరిశీలించగా విస్తుపోయే నిజాలు వెల్లడయ్యాయి. ఈ మేరకు బాలుడి తల్లి రజ్నా పీఎం ఈ విషయాన్ని సామాజిక మాధ్యమంలో పంచుకున్నారు. తన కుమారుడిని గ్లోబల్ పబ్లిక్ స్కూల్‌లోని కొంత మంది విద్యార్థుల గ్యాంగ్ తరచూ ర్యాగింగ్ చేసేదని, స్కూల్ బస్‌లో, స్కూల్‌లో అతడిని ఘోరంగా వేధించి అవమానించేదని ఆమె తెలిపారు. ఆత్మహత్యకు ముందు రోజు తన కుమారుడిని వారు బలవంతంగా వాష్ రూమ్‌లోకి తీసుకెళ్లి టాయిలెట్ సీటును నాకించారని, టాయిలెట్‌ను ఫ్లష్ చేసి అతడి తలను అందులో ముంచారని ఇవన్నీ భరించలేక తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని వెల్లడించారు.

ప్రైవేట్ సంస్థలు ఆధార్ అథెంటికేషన్‌ను వాడుకోవచ్చు!

న్యూఢిల్లీ : ప్రైవేట్ సంస్థలు తమ సేవల బట్వాడా కోసం ఆధార్ అథెంటికేషన్‌ను ఉపయోగించుకోవడానికి కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీని కోసం ఆధార్ చట్టాన్ని సవరించింది. ఎలక్ట్రానిక్స్, ఐటీ మంత్రిత్వ శాఖ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం.. ఆధార్ ఆథెంటికేషన్ ఫర్ గుడ్ గవర్నెన్స్ (సోషల్ వెల్ఫేర్, ఇన్నోవేషన్, నాలెడ్జ్) అమెండ్‌మెంట్ రూల్స్, 2025ను నోటిఫై చేసింది. ఈ సదుపాయం కోసం ప్రైవేట్ సంస్థలు ప్రతిపాదనను పంపిస్తే, దానిని ప్రభుత్వ శాఖల ఆమోదం మేరకు ఆధార్ అథెంటికేషన్ సదుపాయాన్ని కల్పిస్తారు. ప్రైవేట్ సంస్థల ప్రతిపాదనలను మొదట యూఏడీఏఐ పరిశీలిస్తుంది. యూఐడీఏఐ సిఫారసు మేరకు ఆ ప్రైవేటు సంస్థ ఆధార్ అథెంటికేషన్‌ను ఉపయోగించుకోవడానికి ఐటీశాఖ ఆమోదం తెలుపుతుంది.

రాష్ట్రపతి భవన్‌లో పెండ్లి బాజాలు

- ఫిబ్రవరి 12న పీఎస్‌ఓ పూనమ్ గుప్తా వివాహం
- మదర్ థెరిసా క్రౌన్ కాంప్లెక్స్‌లో జరగనున్న వేడుక

న్యూఢిల్లీ, జనవరి 31: దేశ ప్రథమ పౌరురాలి అధికారిక నివాస ప్రాంగణంలో చరిత్రలోనే మొదటిసారిగా పెండ్లి బాజాలు మోగనున్నాయి. ఇద్దరు సీఆర్పీఎఫ్ అధికారుల వివాహానికి రాష్ట్రపతి భవన్ వేదిక కానున్నది. రాష్ట్రపతి భవన్‌లో పీఎస్‌ఓగా పని చేసే సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండంట్ పూనమ్ గుప్తా – జమ్ము కశ్మీర్‌లో సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండంట్‌గా పని చేస్తున్న అవ్‌నీశ్ కుమార్ మనువాడనున్నారు. ఫిబ్రవరి 12న వీరి వివాహం జరగనున్నది. ఈ విషయం తెలుసుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము.. రాష్ట్రపతి భవన్‌లోనే వివాహాన్ని నిర్వహించుకోవాలని సూచించారు. దీంతో రాష్ట్రపతి భవన్‌లోని మదర్ థెరిసా క్రౌన్ కాంప్లెక్స్‌లో పరిమిత సంఖ్యలో అతిథుల నడుమ వీరి వివాహం జరగనున్నది. అతిథుల జాబితా తయారవుతున్నది. జాబితాలో ఉన్న వారికే వివాహానికి హాజరయ్యేందుకు అనుమతి ఉంటుంది. కాగా, పూనమ్ గుప్తా స్వస్థలం మధ్యప్రదేశ్‌లోని శివపురి. ఇటీవల గణతంత్ర దినోత్సవ పరేడ్‌లో సీఆర్పీఎఫ్ మహిళా దళానికి ఆమె సారథ్యం వహించారు.

గ్లోబల్ ఇన్నోవేషన్ పవర్‌హౌస్‌గా భారత్

- డిజిటల్ టెక్నాలజీలో గ్లోబల్ ప్లేయర్‌గా మారాం
- ప్రపంచ అస్థిరత వేళ ఆర్థిక సుస్థిరత సాధించాం
- 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటకు తెచ్చాం
- త్వరలోనే భారతీయ పౌరుడి రోదసి యాత్ర
- ఉభయ సభలనుద్దేశించి రాష్ట్రపతి ముర్ము ప్రసంగం

న్యూఢిల్లీ, జనవరి 31: భారత్‌ను గ్లోబల్ ఇన్నోవేషన్ పవర్‌హౌస్‌గా మార్చడమే లక్ష్యమని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అన్నారు. అసాధారణ వేగంతో ప్రధాన నిర్ణయాలు, విధానాల అమలును దేశం వీక్షిస్తున్నదని, పేదలు, మధ్యతరతి ప్రజలు, యువత, మహిళలు, రైతులకు అత్యధిక ప్రాధాన్యతను తమ ప్రభుత్వం ఇస్తున్నదని ప్రకటించారు. బడ్జెట్ సమావేశాల ప్రారంభానికి ముందు శుక్రవారం లోక్‌సభలో సమావేశమైన పార్లమెంట్ ఉభయసభలనుద్దేశించి రాష్ట్రపతి ప్రసంగిస్తూ తన ప్రభుత్వం మూడో పర్యాయంలో మూడు రెట్ల వేగంతో అభివృద్ధి పరుగులు పెడుతున్నదని తెలిపారు. 60 నిమిషాలపాటు సాగిన తన ప్రసంగంలో రాష్ట్రపతి ప్రభుత్వ గొప్పలను చెప్పుకొచ్చారు. మౌని అమావాస్య నాడు ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళాలో జరిగిన తొక్కిసలాటలో మృతిచెందిన భక్తులకు ఆమె సంతాపాన్ని ప్రకటించారు. ఇటీవల కన్నుమూసిన మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌కు కూడా ఆమె నివాళులర్పించారు.

- అదనంగా మూడు కోట్ల కుటుంబాలకు ఇళ్ల నిర్మాణం, గిరిజనుల సంక్షేమం, గ్రామీణ ప్రజలకు ఆస్తి పత్రాల జారీ, గ్రామీణ రహదారుల నిర్మాణం, 6 కోట్ల మంది సీనియర్ సిటిజన్లకు ఆరోగ్య బీమా పథకం వర్తింపుతోసహా తమ ప్రభుత్వం సాధించిన విజయాలను రాష్ట్రపతి వివరించారు.
- ఆర్థిక, సామాజిక, రాజకీయ సుస్థిరతను సాధించడం ద్వారా ప్రపంచానికి భారత్ ఆదర్శంగా నిలిచిందని పేర్కొన్నారు.
- శ్రీహరికోటలోని అంతరిక్ష కేంద్రం నుంచి 100 రాకెట్ ప్రయోగాలు నిర్వహించడాన్ని రాష్ట్రపతి ప్రశంసించారు. పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో నిర్మించే గగన్‌యాన్ వాహకనౌకలో కూర్చుని రోదసికి భారతీయ పౌరుడు ప్రయాణించే రోజు ఎంతో దూరంలో లేదన్నారు.
- ఒకే దేశం, ఒకే పన్ను స్ఫూర్తితో జీఎస్‌టీ విధానాన్ని ప్రవేశపెట్టామని, డిజిటల్ టెక్నాలజీలో అగ్రగామిగా నిలిచామని25 కోట్ల మంది ప్రజలను పేదరికం నుంచి బయటకు తెచ్చినట్టు రాష్ట్రపతి తెలిపారు.

నేడు కేంద్ర బడ్జెట్

లోక్‌సభలో ప్రవేశపెట్టనున్న కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల

2025-26 ఆర్థిక సంవత్సరానికి గానూ కేంద్ర బడ్జెట్‌ను ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం ప్రవేశపెట్టనున్నారు. లోక్‌సభలో ఉదయం 11 గంటలకు ఆమె బడ్జెట్ ప్రసంగం ఉంటుంది. ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ వరుసగా ఎనిమిదో సారి బడ్జెట్ ప్రవేశపెడుతున్నారు. కాగా, ఈ బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి ప్రాధాన్యం ఉంటుందని, పలు పన్ను సంస్కరణలు కూడా ఉండే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు అంచనా వేస్తున్నారు. పాత పన్ను విధానాన్ని దశలవారీగా తొలగించే ప్రక్రియ ప్రారంభించవచ్చని చెప్తున్నారు. రూ.10 లక్షల లోపు ఆదాయం పొందే వారికి ఆదాయ పన్ను నుంచి మినహాయింపు ఇవ్వొచ్చనే అంచనాలున్నాయి.

ఆప్‌కు 8 మంది ఎమ్మెల్యేల రాజీనామా

ఎన్నికల ముందు పార్టీకి షాక్

న్యూఢిల్లీ: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలకు వారం రోజులు కూడా లేని సమయంలో అధికార ఆమ్ ఆద్మీ పార్టీకి గట్టి షాక్ తగిలింది. సొంత పార్టీ ఎమ్మెల్యేలు 8 మంది శుక్రవారం పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. అయితే వీరంతా ఈ ఎన్నికల్లో టికెట్లు లభించని వారే. పాలమ్ ఎమ్మెల్యే భవన్ గౌర్ ఈ మేరకు పార్టీ జాతీయ కన్వీనర్, మాజీ సీఎం కేజ్రీవాల్‌కు లేఖ రాస్తూ పార్టీ పట్ల తాను విశ్వాసాన్ని కోల్పోయానని, అందుకే రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు. త్రిలోక్‌పురి ఎమ్మెల్యే రోహిత్ మెహ్రౌలియా, జనక్‌పురి ఎమ్మెల్యే రాజేశ్ రిషి, కస్తుర్బా నగర్ ఎమ్మెల్యే మదన్ లాల్, మెహ్రౌలీ ఎమ్మెల్యే నరేశ్ యాదవ్ పార్టీకి, పార్టీ సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు.

పోలింగ్ వీడియోలను భద్రపరచాలి

ఈసీకి సుప్రీంకోర్టు ఆదేశం

న్యూఢిల్లీ : ఎన్నికల పోలింగ్ జరిగేటపుడు చిత్రీకరించిన సీసీటీవీ వీడియోలను భద్రపరచాలని ఎన్నికల కమిషన్ (ఈసీ)ని సుప్రీంకోర్టు శుక్రవారం ఆదేశించింది. ప్రతి పోలింగ్ బూత్‌కు ఓటర్ల సంఖ్యను 1,200 నుంచి 1,500కు పెంచడాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ఈ ఆదేశాలు ఇచ్చింది. ఇందు ప్రకాశ్ సింగ్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌పై స్పందించేందుకు సమయం కావాలని ఈసీ తరపు న్యాయవాది కోరారు. ఎన్నికల నిబంధనలు, 1961కి ఇటీవల చేసిన సంస్కరణలను సవాల్ చేస్తూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ దాఖలు చేసిన పిటిషన్‌పై స్పందించాలని కేంద్ర ప్రభుత్వం, ఈసీలను సుప్రీంకోర్టు జనవరి 15న ఆదేశించింది.

పూర్ లేడీ.. పూర్ థింగ్

- రాష్ట్రపతి ప్రసంగంపై కాంగ్రెస్ నేత సోనియా గాంధీ వ్యాఖ్య
- బోరింగ్ స్పీచ్ అని మరో నేత రాహుల్ గాంధీ కామెంట్
- రాష్ట్రపతి గౌరవాన్ని దెబ్బ తీయడమే : రాష్ట్రపతి భవన్
- కాంగ్రెస్ పార్టీ క్షమాపణలు చెప్పాలని బీజేపీ డిమాండ్

న్యూఢిల్లీ, జనవరి 31: రాష్ట్రపతి ద్రౌపది ముర్మును ఉద్దేశించి కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదంగా మారాయి. శుక్రవారం పార్లమెంటు బడ్జెట్ సమావేశాల ప్రారంభం సందర్భంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉభయ సభలను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీ కలిసి పార్లమెంటు బయటకు వచ్చారు. రాష్ట్రపతి ప్రసంగంపై స్పందించాల్సిందిగా మీడియా ప్రతినిధులు సోనియా గాంధీని కోరగా.. 'పూర్ లేడీ.. ప్రసంగం చివరికి వచ్చేసరికి రాష్ట్రపతి అలిసిపోయారు. ఆమె మాట్లాడలేకపోయారు. పూర్ థింగ్' అని వ్యాఖ్యానించారు. మరోవైపు సోనియా గాంధీ మాట్లాడుతుండగా రాహుల్ గాంధీ సైతం రాష్ట్రపతి ప్రసంగాన్ని ఉద్దేశించి 'బోరింగ్. నో కామెంట్స్. చెప్పిందే చెప్పారు' అని అన్నారు.

ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు

సోనియా గాంధీ వ్యాఖ్యలను రాష్ట్రపతి కార్యాలయం తీవ్రంగా తప్పుబట్టింది. రాష్ట్రపతి ఎక్కడా అలిసిపోలేదని స్పష్టం చేస్తూ ఒక ప్రకటన జారీ చేసింది. 'పలువురు ప్రముఖ కాంగ్రెస్ నేతలు చేసిన వ్యాఖ్యలు రాష్ట్రపతి గౌరవాన్ని దెబ్బతీసేలా ఉన్నాయి. ఈ వ్యాఖ్యలు దురదృష్టకరం, ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు. రాష్ట్రపతి తన ప్రసంగంలో ఎక్కడా అలసిపోలేదు. పేద, అణగారిన వర్గాలు, మహిళలు, రైతుల గురించి మాట్లాడేటప్పుడు ఆమెకు అలుపనేదే రాదు. హిందీ వంటి భారతీయ భాషలు, యాసపై అవగాహన లేని వారు ఇలా తప్పుడు అభిప్రాయానికి వచ్చి ఉంటారని భావిస్తున్నాం' అని రాష్ట్రపతి కార్యాలయం పేర్కొన్నది.

దేశ ప్రజలను అవమానించడమే: మోదీ

రాష్ట్రపతిపై సోనియా గాంధీ చేసిన వ్యాఖ్యలపై ప్రధాని నరేంద్ర మోదీ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'దళిత, ఆదివాసీ, ఓబీసీ, పేదలు పురోగతి సాధిస్తుంటే అవమానించడం రాజ కుటుంబానికి(గాంధీ కుటుంబాన్ని ఉద్దేశించి) అలవాటు. ఆదివాసీ బిడ్డ ప్రసంగాన్ని విసుగుపుట్టించిందని ఆ కుటుంబసభ్యుడొకరు అన్నారు. మరొకరు ఇంకో అడుగు ముందుకేసి పూర్ థింగ్ అని వ్యాఖ్యానించారు. ఇది దేశంలోని 10 కోట్ల మంది ఆదివాసీ అక్కచెల్లెళ్లతో పాటు ప్రతి పౌరుడికీ అవమానం' అని మోదీ పేర్కొన్నారు. 'సోనియా గాంధీ ఇలాంటి వ్యాఖ్యలు చేయడం పూర్తిగా కాంగ్రెస్ పార్టీ పెత్తందారీ, పేదల వ్యతిరేక, ఆదివాసీ వ్యతిరేక స్వభావాన్ని చాటుతున్నది. రాష్ట్రపతికి, దేశంలోని ఆదివాసీలకు కాంగ్రెస్ పార్టీ బేషరతుగా క్షమాపణ చెప్పాలి' అని బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఆదివాసీ మహిళ దేశ ప్రథమ పౌరురాలు కావడాన్ని జమిందారీ ఆలోచనావిధానం కలిగిన కాంగ్రెస్ పార్టీ జీర్ణించుకోలేకపోతున్నదని బీజేపీ ఎంపీ సుకాంత మజుందార్ ఆరోపించారు.

తొలిసారి ఐఎస్ఎస్‌కు భారత వ్యోమగామి

- 'ఏఎక్స్-4' మిషన్ పైలట్‌గా శుభాంశు శుక్లా

న్యూఢిల్లీ: అమెరికన్ సంస్థ 'యాక్సియమ్' త్వరలో మరోసారి రోదసి యాత్ర నిర్వహించనున్నది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి నిర్వహించే ఈ ప్రైవేట్ యాత్రకు భారత వాయుసేన అధికారి, ఇస్రో వ్యోమగామి శుభాంశు శుక్లా పైలట్‌గా ఎంపికైనట్టు 'నాసా' ప్రకటించింది. ఫ్లోరిడాలో కెనడీ స్పేస్ సెంటర్ నుంచి వసంత కాలంలో (మే-జూన్) ఈ యాత్ర మొదలవుతుంది. దీనిలో భాగంగా 'స్పేస్‌ఎక్స్' సంస్థకు చెందిన 'డ్రాగన్' వ్యోమనౌక ద్వారా శుభాంశు శుక్లా ఐఎస్ఎస్‌కు చేరుకోనున్నారు. దీంతో ప్రైవేట్ రోదసి యాత్ర ద్వారా ఐఎస్ఎస్‌కు వెళ్లిన తొలి భారత వ్యోమగామిగా ఆయన చరిత్రకెక్కనున్నారు. పైలట్‌గా ఈ యాత్రలో పాల్గొనేందుకు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నానని శుక్లా గురువారం ఓ వెబినార్‌లో తెలిపారు.

ఆలయాల్లో వీఐపీ దర్శనానికి వ్యతిరేకంగా పిల్

విచారణకు నిరాకరించిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: హిందూ దేవాలయాల్లో ప్రముఖులకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ, భగవంతుడిని ప్రత్యేకంగా దర్శనం చేసుకునే అవకాశం కల్పించడం, వీఐపీ దర్శనాల కోసం అదనపు రుసుమును వసూలు చేయడం ఆపాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)ను సుప్రీంకోర్టు శుక్రవారం తిరస్కరించింది. ఎవరికీ ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వకూడదనేది తమ అభిప్రాయమని, అయినప్పటికీ, ఎటువంటి ఆదేశాలనూ ఇవ్వలేమని సీజేఐ జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్ చెప్పారు. ఈ పిల్‌ను డిస్మిస్ చేసినంత మాత్రానికి అధికారులు తగిన చర్యలు చేపట్టడంపై ఎటువంటి ఆంక్షలు లేవని స్పష్టం చేశారు. తమ వినతులపై హోం మంత్రిత్వ శాఖ స్పందించి ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వానికి మాత్రమే ఆదేశాలు జారీ చేసిందని పిటిషనర్ తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న హిందూ దేవాలయాల నిర్వహణ, పరిపాలనను పర్యవేక్షించేందుకు జాతీయ స్థాయిలో ఓ బోర్డును ఏర్పాటు చేయాలని కోరారు.

మమతా కులకర్ణికి షాక్

కిన్నెర అఖాడా నుంచి బహిష్కరణ చేరిన కొద్ది రోజులకే వేటు

లక్నో: కొద్ది రోజుల క్రితమే సన్యాసినిగా మారి మహామండలేశ్వర్ దీక్ష తీసుకున్న ప్రముఖ బాలీవుడ్ నటి మమతా కులకర్ణి (52)కి షాక్ తగిలింది. ఆమెను కిన్నెర అఖాడా నుంచి బహిష్కరిస్తున్నట్టు నిర్వాహకులు ప్రకటించారు. మహామండలేశ్వర్‌గా ఆమె తీసుకున్న దీక్షను రద్దు చేసినట్టు చెప్పారు. పలువురు మఠ పెద్దలు, అఖాడాల నుంచి వచ్చిన అభ్యంతరాల వల్ల ఈ నిర్ణయం తీసుకున్నట్టు అఖాడా పెద్దలు తెలిపారు. ఆమెను అఖాడాలో చేర్పించిన కిన్నెర అఖాడా ఆచార్య మహామండలేశ్వర్ లక్ష్మీనారాయణ్ త్రిపాఠీని సైతం అఖాడా నుంచి తప్పించారు. మమతా కులకర్ణి.. అఖాడాలో చేరిన తర్వాత అందులోని సభ్యుల మధ్య వివాదాలు ఏర్పడ్డాయి. అఖాడాలో అత్యున్నత స్థానమైన మహామండలేశ్వర్ హోదాను చేరగానే ఆమెకు కట్టబెట్టడాన్ని పలువురు వ్యతిరేకించారు.

ప్రపంచమంతా ఎగబడితే ఎలా?

- నాడు బానిసల పిల్లల కోసం రాజ్యాంగ సవరణ చేశాం
- జన్మతః పౌరసత్వంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్, జనవరి 31: జన్మతః పౌరసత్వాన్ని కల్పించడం కోసం రాజ్యాంగ సవరణ ఆమోదించింది బానిసల పిల్లల కోసమే తప్ప ప్రపంచ ప్రజలంతా అమెరికాపై ఎగబడి తిష్ఠవేసేందుకు కాదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించారు. వైట్ హౌస్‌లోని ఓవల్ ఆఫీసులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జన్మతః పౌరసత్వాన్ని కల్పించే రాజ్యాంగ సవరణను ఆమోదించిన రోజులను గుర్తుకు తెచ్చుకుంటే అది బానిసల పిల్లల కోసమేనని అర్థమవుతుందని అన్నారు. ప్రపంచంలోని ప్రజలంతా అమెరికాకు తరలివచ్చి ఇక్కడే తిష్ఠ వేసుకోవడానికి కాదని ఆయన చెప్పారు. ఎవరుపడితే వారు అమెరికా వచ్చేస్తున్నారని, అర్హతలు లేని వారు, అర్హతలు లేని పిల్లల కోసం ఇది ఉద్దేశించింది కాదని ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన మొదటి రోజే ట్రంప్ సంతకం చేసిన అనేక ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లలో జన్మతః పౌరసత్వం రద్దు కూడా ఉంది. అయితే సియాటెల్ రాష్ట్రంలోని ఫెడరల్ కోర్టు ఈ ఉత్తర్వును తాత్కాలికంగా నిలిపివేసింది. కోర్టు నిర్ణయాన్ని సుప్రీంకోర్టులో సవాలు చేస్తానని ప్రకటించిన ట్రంప్ అక్కడ తీర్పు తమకు అనుకూలంగా వస్తుందన్న ధీమాను వ్యక్తం చేశారు. బానిసలకు జన్మతః పౌరసత్వం కల్పించడానికి తాను పూర్తిగా అనుకూలమని స్పష్టం చేసిన ట్రంప్, ఇది చాలా ఉదాత్తమైన విషయమని పేర్కొన్నారు. జన్మతః పౌరసత్వం కల్పించడం వెనుక ఉద్దేశం ప్రపంచమంతా అమెరికాను ఆక్రమించుకోమని కాదని ఆయన స్పష్టం చేశారు. అక్రమ వలసదారులు, తాత్కాలిక వీసాలపై వచ్చిన నాన్ ఇమ్మిగ్రంట్ల పిల్లలకు జన్మతః పౌరసత్వాన్ని రద్దు చేసేందుకు ఉద్దేశించిన ఓ బిల్లును రిపబ్లికన్ సెనేటర్లు అమెరికా సెనేట్‌లో ఇటీవల ప్రవేశపెట్టారు. అమెరికన్ పౌరుడు లేదా అమెరికా జాతీయుడు, చట్టబద్ధంగా అమెరికా శాశ్వత నివాసి, అమెరికా సాయుధ దళాలలో పనిచేస్తున్న ఇమ్మిగ్రెంట్‌కు జన్మించిన పిల్లలకు మాత్రమే జన్మతః పౌరసత్వాన్ని కల్పించాలని కోరుతూ జన్మహక్కు పౌరసత్వ చట్టం, 2025ని సెనేటర్లు లిండ్‌సే గ్రాహం, టెడ్ క్రూజ్, కేటీ బ్రిట్ ఇటీవల సెనేట్‌లో ప్రవేశపెట్టారు.

బ్రిక్స్ దేశాలపై 100 శాతం టారిఫ్ విధిస్తా..

ప్రపంచ రిజర్వ్ కరెన్సీగా అమెరికన్ డాలర్ స్థానంలో వేరే కరెన్సీ తెచ్చేందుకు ప్రయత్నిస్తే 100 శాతం సుంకాన్ని విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం బ్రిక్స్ సభ్య దేశాలను మరోసారి హెచ్చరించారు. అమెరికన్ డాలర్ స్థానంలో కొత్త బ్రిక్స్ కరెన్సీని గాని లేదా వేరే కరెన్సీని బలపరచడం కాని చేయబోమని బ్రిక్స్ సభ్య దేశాల నుంచి తమకు హామీ కావాలని, లేని పక్షంలో ఆ దేశాలు 100 శాతం సుంకాన్ని ఎదుర్కోవలసి వస్తుందని సోషల్ మీడియా వేదిక ట్రూత్‌సోషల్ పోస్టులో ట్రంప్ హెచ్చరించారు. అంతర్జాతీయ వాణిజ్యంలో కాని మరెక్కడైనా కాని అమెరికన్ డాలర్‌ను భర్తీ చేసే అవకాశం బ్రిక్స్‌కు లేదని, ఒక వేళ ఏ దేశమైనా ఆ ప్రయత్నం చేస్తే సుంకాలకు హలో చెప్పి అమెరికాకు గుడ్‌బై చెప్పాల్సి వస్తుందని స్పష్టంచేశారు. బ్రిక్స్ సభ్య దేశాలలో బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా, ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, ఇండోనేషియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఉన్నాయి. ఈ గ్రూపునకు ఉమ్మడి కరెన్సీ ఏదీ లేనప్పటికీ ఉక్రెయిన్‌తో యుద్ధం అనంతరం అనేక పశ్చిమ దేశాల నుంచి రష్యా ఆంక్షలను ఎదుర్కోవడంతో ఈ అంశంపై చర్చలు జోరందుకున్నాయి.

డిస్కంల ప్రైవేటీకరణను నిరసిస్తూ హైదరాబాద్‌లో ధర్నా చేస్తున్న విద్యుత్తు ఉద్యోగులు

డిస్కంల ప్రైవేటీకరణపై దేశవ్యాప్త నిరసన

కదంతొక్కిన విద్యుత్తు ఉద్యోగులు

చండీగఢ్, జనవరి 31: ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, చండీగఢ్ ప్రభుత్వాలు డిస్కంలను ప్రైవేటీకరించే ప్రయత్నాలను నిరసిస్తూ శుక్రవారం దేశ వ్యాప్తంగా వివిధ రాష్ట్రాల విద్యుత్తు ఉద్యోగులు వీధుల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. మొత్తం 27 లక్షల మంది ఉద్యోగులు పాల్గొంటున్న ఈ నిరసన శనివారమూ కొనసాగిస్తామని ఆల్ ఇండియా పవర్ ఇంజినీర్స్ ఫెడరేషన్ అధ్యక్షుడు శైలేంద్ర దూబే వెల్లడించారు. 'ఏ ప్రాతిపదికన యూపీలో పూర్వాంచల్, దక్షిణాంచల్ విద్యుత్ వితరణ్ నిగమ్ లిమిటెడ్‌లను ప్రైవేటీకరిస్తున్నారు' అని ఆయన ప్రశ్నించారు. రూ.22 వేల కోట్ల ఆస్తులు కలిగిన చండీగఢ్ విద్యుత్తు విభాగాన్ని కేవలం రూ.871 కోట్లకు ప్రైవేటీకరిస్తున్నారని తెలిపారు. రాజస్థాన్‌లోనూ జెన్కోను ప్రైవేటుపరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆయన చెప్పారు. యూపీ, మహారాష్ట్రలోని ప్రధాన నగరాలతో పాటు దేశంలోని ప్రముఖ నగరాల్లో పెద్ద యెత్తున పవర్ ఇంజినీర్స్ నిరసన తెలిపారని దూబే తెలిపారు.

ఇరాన్‌లో ముగ్గురు ఇండియన్స్ మిస్సింగ్

న్యూఢిల్లీ: ఇరాన్‌లో ముగ్గురు భారతీయులు తప్పిపోయారు. వీరిని గుర్తించేందుకు, సురక్షితంగా కాపాడేందుకు మన దేశ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ కృషి చేస్తున్నది. ఎంఈఏ అధికార ప్రతినిధి రణధీర్ జైశ్వాల్ శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం, ఈ అంశంపై న్యూఢిల్లీలోని ఇరానియన్ ఎంబసీతోనూ, టెహ్రాన్‌లోని ఇరానియన్ విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖతోనూ ఎంఈఏ అధికారులు చర్చించారు.

నేనూ జాత్యహంకార బాధితుడినే :కాశ్ పటేల్

వాషింగ్టన్, జనవరి 31: తాను పెరుగుతున్న క్రమంలో జాత్యహంకారానికి గురయ్యానని అమెరికా ఎఫ్‌బీఐ డైరెక్టర్‌గా ట్రంప్ ఎంపిక చేసిన కాశ్ పటేల్ అన్నారు. ఎఫ్‌బీఐ డైరెక్టర్‌గా కాశ్‌ను ధ్రువీకరించేందుకు జరిగిన సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 'నన్ను అసహ్యమైనవాడినని గేలి చేసేవారు. మీరు నల్లజాతి వాళ్లు.. ఎక్కడి నుంచి వచ్చారో అక్కడికే వెళ్లిపోమని నన్ను దూషించేవారు' అని కాశ్ తెలిపారు.

స్పేస్‌వాకింగ్‌లో సునీత రికార్డ్

**62 గంటల 6 నిమిషాలు నడిచిన తొలి మహిళా వ్యోమగ